సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



పంద్రాగస్టు వేడుకలకు రిహార్సల్స్
స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రిహార్సల్స్‌ను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించారు. ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు గౌరవవందనం స్వీకరించారు. - 8లో



రిమ్స్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన
మహిళా పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటనకు నిరసనగా ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్లు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.6 /27.4

వాతావరణం
జిల్లాలో సోమవారం 28.4 - 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 8.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సాగునీటిని విడుదల చేయండి
– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల : పులివెందుల నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని విడుదల చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నీటి పారుదలశాఖ సీఈ మల్లికార్జునరెడ్డికి సూచించారు. సోమవారం ఆయన సీఈ మల్లికార్జునరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయన్నారు. దీంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంటపొలాల్లోని బోర్లలో కూడా నీరు అడుగంటి పోయాయని వివరించారు. ప్రస్తుత పరిస్థితిలో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 3.5టీఎంసీ నీరు నిల్వ ఉందన్నారు. వెంటనే ఆ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిత్రావతి నుంచి నీరు విడుదల చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని అరటి, చీనీ, ఇతర పంటలు పండించే రైతన్నలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వెంటనే చిత్రావతి నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలను తనిఖీ చేస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు సోమవారం వైవీయూలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాల విద్యార్థులు విశ్వవిద్యాలయ కేంద్రంలో హాజరయ్యారు. పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఉదయం జరిగిన పరీక్షకు 475 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 326 మంది హాజరయ్యారు. వైవీయూ పరీక్షల విభాగ ముఖ్య పర్యవేక్షకులు ఆచార్య పి. పద్మ, సహాయ పర్యవేక్షకులు డాక్టర్ మునికుమారి, సిబ్బంది చంద్రమౌళి పాల్గొన్నారు.

'వే'మన' వెలుగులు
– టాప్–100 విశ్వవిద్యాలయాల్లో వైవీయూకు చోటు



వైవీయూ : కడప యోగివేమన విశ్వవిద్యాలయం ఖ్యాతి మరోసారి జాతీయస్థాయిలో రెపరెపలాడింది. భారత విద్యామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేసిన విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లో టాప్–100లో వైవీయూ చోటు దక్కించుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్)–2024 ప్రకటించిన ర్యాంకింగ్‌లో వైవీయూ 51 నుంచి 100 శ్రేణి ర్యాంకింగ్‌లో చోటు దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని నూతన విశ్వవిద్యాలయాల్లో వైవీయూకు మాత్రమే ఈ ర్యాంకింగ్‌లో చోటు దక్కడం విశేషం. పరిశోధన, అభివృద్ధి, ప్లేస్‌మెంట్, అవుట్ రీచ్ అండ్ ఇన్‌క్లూసివిటీ, పీర్ పర్సెప్షన్ అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకింగ్ కేటాయించారు.

ప్రభుత్వ ప్లాన్ ఏమిటో!

- జిల్లా ప్రణాళికపై మౌనం!
- ఆమోదిస్తేనే పెండింగ్ పనులు ముందుకు
- ప్రాధాన్యత రంగాలకు నిధులు సమకూరేనా?
- ప్రణాళిక ఆమోదిస్తేనే పనులకు మోక్షం

పాడికైనా.. కాడికైనా ఆ ప్రణాళిక అమలు జరగాల్సిందే. పరిశ్రమలు పరుగులు పెట్టాలన్నా... అభివృద్ధి అందలమెక్కాలన్నా ఆ ఫైలు ముందుకు కదలాల్సిందే. పంటకు సాగునీరు.. ఇంటికి తాగునీరు చేరాలంటే ప్రభుత్వం నుంచి నిధులు వరదై పారాల్సిందే.. చివరికి భూమిలోని పైరుకు.. రోడ్డుపై తారుకూ ఆ నిధులే ముఖ్యం.. పెండింగ్ పనుల మోక్షానికైనా.. ఉద్యాన పంటల లక్ష్యానికైనా విజన్ ప్లాన్‌కు ఆమోద ముద్ర పడాల్సిందే. జిల్లా ప్రణాళికపై ప్రభుత్వం మౌనం వహిస్తున్న నేపథ్యంలో కథనం.



కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ప్రాధాన్యత రంగాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి జిల్లా యంత్రాంగం విజన్ ప్లాన్ రూపొందించింది. వ్యవసాయం, ఉద్యాన పంటలు, ఇరిగేషన్, తాగునీరు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. వీటికోసం ఎన్ని నిధులు అవసరమో అంశాల వారీగా ప్రతిపాదనలు తయారు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రెండు రోజులపాటు జరిగిన కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్ శివశంకర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విజన్ ప్లాన్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసి నిధులు విడుదల చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు దీనికి సంబంధించిన ఎలాంటి స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. విజన్ ప్లాన్‌లో పొందుపరిచిన వివరాల్లోకి వెళితే.....



ఉద్యాన పంటలు

జిల్లాలోని కొండాపురం, లింగాల, వేంపల్లె, వేముల, వీఎన్ పల్లె, పులివెందుల, సింహాద్రిపురం మండలాల్లో ప్రధానంగా ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. అరటి, చీనీ, మామిడి, బొప్పాయి, నిమ్మ, మిరప ముఖ్యంగా సాగయ్యే పంటల్లో ఉన్నాయి. జిల్లాలోని 36 మండలాల్లో 64,395 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతుండగా, 14.91 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది. ప్రధాన ఎగుమతి పంటైన అరటి 3,70,699 మెట్రిక్ టన్నుల దిగుబడి ఉంది. ఉద్యాన పంటల సాగు పెంచడం, యాంత్రీకరణ, పంట కోత తర్వాత నిర్వహణ, ఎగుమతులు పెంచాలన్నవి లక్ష్యాలుగా నిర్ణయించారు. వీటి కోసం 397.84 లక్షలు అవసరం.

వ్యవసాయ రంగం

జిల్లా విజన్ ప్లాన్‌లో వ్యవసాయ రంగానికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు. ఈ రంగంలో ఉత్పాదకత పెంచాలని, యాంత్రీకరణకు ప్రోత్సాహం, రైతుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించాలని లక్ష్యాలుగా నిర్ణయించారు. జిల్లాలోని 1500 హెక్టార్లలో వేరుశనగ పంటలో ఉత్పాదకత పెంచేందుకు 50 శాతం సబ్సిడీతో రైతులకు జిప్సమ్ సరఫరా చేయాలని ఇందులో పొందుపరిచారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు కల్టివేటర్లు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, నీటి సరఫరా పైపులు, టార్పాలిన్ షీట్లు, జిప్సమ్ అందించాలని ప్రతిపాదించారు. ఇందుకు మొత్తం 74.19 కోట్ల రూపాయలు అవసరం అవుతుంది. ఇందులో రైతుల వాటాగా రూ. 40.55 కోట్లు పోగా, మిగతా రూ. 33.64 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు.

నీటి పారుదలకు కోట్లు అవసరం

బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాలువల పనులకు తక్షణమే రూ. 15 కోట్లు అవసరం అవుతుంది. ఈ పనులు పూర్తి చేస్తే 13,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు వీలవుతుంది. గాలేరు–నగరి ఫేస్–1 ప్యాకేజీ–2 కింద వామికొండ, సర్వరాయసాగర్ రిజర్వాయర్ల సీపేజీ అరికట్టి డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ విస్తరించడం కోసం రూ. 150 కోట్లు అవసరం అవుతాయని విజన్ ప్లాన్‌లో వెల్లడించారు. ఇందువల్ల 35 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

కడప తాగునీటికి..

కడప నగరానికి ప్రస్తుతం 57.10 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) డిమాండుకుగాను 50.92 ఎంఎల్‌డీ సరఫరా అవుతున్నాయి. ఇంకా 6.18 ఎంఎల్‌డీ లోటు ఉంది. అమృత్ 1.0 ఫేస్–1 కింద కడప తాగునీటి సరఫరా పథకం కోసం 43.82 కోట్ల రూపాయలు మంజూరుకాగా, 25.938 కోట్లు విడుదలైంది. కాగా, రూ. 26.31 కోట్ల ఖర్చుతో 62.46 శాతం పనులే పూర్తయ్యాయి.

మెగా ఇండస్ట్రియల్ పార్కు

విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కుకు పీఎం గతిశక్తి కింద రూ. 225 కోట్లు మంజూరయ్యాయి. ఈ పార్కు కు మైదుకూరు నుంచి పైపులైన్ ద్వారా నీటి సరఫరాకు రూ. 150 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు వచ్చే ఏడాది మార్చి 30కి పూర్తి కావాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ప్రస్తుతం 15 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. 1645 ఎంఎల్ సామర్థ్యంతో రూ. 38 కోట్లతో చేపట్టిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు 48 శాతం పూర్తయ్యాయి. కృష్ణాపురం నుంచి 2.54 కిలోమీటర్ల పొడవున రైల్వేలైన్‌ను కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు వరకు చేపట్టేందుకు రూ. 54 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు 40 శాతం పూర్తయ్యాయి. మొత్తం ఈ పనులన్నింటికీ రూ. 242 కోట్లు అవసరం అవుతాయి. అంటే ఇంకా రూ. 17 కోట్లు అవసరముందని జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మైలవరం వద్ద కొత్త మెగా సోలార్ పార్కు ఏర్పాటుకు 3774 ఎకరాలు అవసరం. ఈ పార్కులో 3500 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగనుంది. పారిశ్రామిక మౌలిక సదుపాయాల పనుల కింద గోపవరం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రూ. 1525.49 లక్షలతో చేపడుతున్నారు. ఇందులో రూ.1050 లక్షలు భారత ప్రభుత్వం గ్రాంటు కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 475.49 లక్షలుగా ఉంది. పెండింగ్‌లో ఉన్న రూ. 525 లక్షలను కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయించాలని కలెక్టర్ కోరారు.

తాగునీరు




ఒంటిమిట్ట సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ పునరుద్ధరణకు రూ.2.10 కోట్లు అవసరం అవుతాయని, ఇందు వల్ల 28 గ్రామాలకు తాగునీటి సౌకర్యం అందుతుందని ప్రభుత్వానికి నివేదించారు. బ్రహ్మంగారిమఠంలో తాగునీటి పంపుసెట్లను మార్చేందుకు రూ.40 లక్షలు ఖర్చు చేస్తే 46 గ్రామాలకు లబ్ధి చేకూరుతుంది. 15 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.40 లక్షలు అవసరమవుతాయి. చక్రాయపేట మండలంలో ఏడు గ్రామాలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు రూ. 50 లక్షలు అవసరం.

ఆర్‌అండ్‌బీ



జిల్లాలో సింగిల్, డబుల్ లేన్ రోడ్లు 3109 కిలోమీటర్లు ఉన్నాయి. వీటి వార్షిక నిర్వహణ కోసం సింగిల్ లేన్ రోడ్లకు ఒక్కో కిలోమీటరుకు రూ.40 వేలు, డబుల్ లేన్ రోడ్లకు ఒక్కో కిలోమీటరుకు రూ. 50 వేలు చొప్పున రూ. 13.45 కోట్లు అవసరం. దీర్ఘకాలంలో రోడ్ల పునరుద్ధరణకు రూ. 90 కోట్లు అవసరం అవుతాయని ప్రతిపాదనలు సమర్పించారు.

గండికోట టూరిజం



స్వదేశీ దర్శన్ 2.0 కింద గండికోట టూరిజం ప్రాజెక్టు కోసం రూ. 70 కోట్లు అవసరం అవుతుంది. ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం కింద జిల్లాలో చేపడుతున్న పనుల గురించి కలెక్టర్ తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలుస్తోంది.

పట్టు వదలని టీడీపీ నేతలు!

- ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నం
- ఓ బార్ యాజమానికి రెన్యువల్స్ చేయించవద్దని ఎమ్మెల్యే ద్వారా ఫోన్
- కీలక నేతతో కలిసి విజయవాడ వెళ్లేందుకు సన్నాహాలు



సాక్షి ప్రతినిధి, కడప : కారు చౌకగా బార్ అండ్ రెస్టారెంట్లు కొట్టేసేందుకు టీడీపీ నేతలు విఫలయత్నం చేస్తున్నారు. రెన్యువల్స్ చేయించవద్దని... లైసెన్సు ఫీజు చెల్లించవద్దని ఇప్పటికే కడపలోని బార్ యాజమానులతో రహస్య సమావేశం చేపట్టారు. తాజాగా ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఆమేరకు ఇరువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ బార్ నిర్వాహకుడికి ఓ ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ చేసినట్లు సమాచారం. అందరు బార్ యాజమానులు ఏకతాటిపైకి వస్తున్నారు, తొందరపడి లైసెన్సు ఫీజు చెల్లించవద్దని సదరు ఎమ్మెల్యే చెప్పుకొచ్చినట్లు సమాచారం. ఆ మేరకు టీడీపీ కీలక నేతతో కలిసి విజయవాడ వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తిరిగి దక్కుతాయని గ్యారెంటీ ఏంటి..?
ప్రభుత్వ నిబంధనలు మేరకు బార్ లైసెన్సు ఫీజు కేవలం రూ.40లక్షలు. పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఒక్కొక్క బార్ రూ.1.7 కోట్లు నుంచి రూ.1.89 కోట్లు వరకూ వేలంలో దక్కించుకున్నారు. ప్రస్తుతం 12 బార్లు ఉంటే అందులో రెండింటినీ దౌర్జన్యంగా పచ్చ నేతలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం అన్నీ బార్లు ఈనెల 20తేది లోపు లైసెన్సు ఫీజు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలాంటి పరిస్థితిలో ఎవ్వరూ లైసెన్సు ఫీజు చెల్లించవద్దనే దిశగా అడుగులు వేస్తున్నారు. పునః టెండర్‌లో ఎవరి బార్ వారికే దక్కేలా ప్రణాళికలు చేద్దామని చెబుతున్నారు.

ఆశకు పోతే 'బార్లా'పడతామా!
జిల్లా కేంద్రంలో అలా ఎవరి బార్ వారికే సొంతం చేసుకునే అవకాశం ఉంటుందా? పోటీ లేకుండా కడప, కమలాపురం నాయకుల వల్లే సాధ్యమౌతుందా? జిల్లాలో అధికార పార్టీ నేతలు ఎవరైనా తలదూరిస్తే పరిస్థితి ఏమిటి? పచ్చ నేతల మాట వింటే ఉన్న బార్ కూడా పోగొట్టుకోవాల్సి వస్తుందేమో? బార్ యాజమానుల్లో ఇలాంటి సందేహాలే వస్తున్నాయట. జిల్లా కేంద్రం ఎవరి గుత్తాధిపత్యం కాదు, ఎవరైనా పోటీలో పాల్గొంటారనే నగ్న సత్యాన్ని విస్మరిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. ఈపరిస్థితులల్లో బుధవారం కీలక నేతతో కలిసి విజయవాడ వెళ్లి ఎక్సైజ్‌శాఖలో అసలేం జరుగుతుందో ఓ అంచనా వేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

స్టాఫ్ నర్స్‌ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్

నేటి నుంచే కౌన్సెలింగ్

కడప రూరల్ : ఐదో విడత స్టాఫ్ నర్స్ నియామకాలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా మంగళవారం నుంచి సుమారు 206 మందికి నియామక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నిజానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వైద్య ఆరోగ్య శాఖ విభాగాల్లో వివిధ కేడర్‌లకు సంబంధించి పెద్ద ఎత్తున నియామకాలు జరిగాయి. అందులో భాగంగా కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలు పెద్ద సంఖ్యలో జరిగాయి.

ఇప్పటికే నాలుగు విడతల్లో నియామకాలు..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023 నవంబర్‌లో స్టాఫ్ నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. నిబంధనల ప్రకారం, మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జాబితాను సిద్ధం చేశారు. నాలుగు విడతలుగా నియామక కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఒక విడతకు 100 మందికి పైగా నియామక పత్రాలను అందజేశారు. ఐదవ విడతలో పులివెందుల, మదనపల్లె, ఆదోని మెడికల్ కాలేజీల్లో మొత్తం 206 మందిని స్టాఫ్ నర్స్ నియామకాలను చేపట్టడానికి జాబితాను సిద్ధం చేశారు. అంతలోపే ఎన్నికల కోడ్ రావడంతో నియామక ప్రక్రియ నిలిచింది. అనంతరం టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదట్లోనే స్టాఫ్ నర్స్ నియామక ప్రక్రియను నిలుపుదల చేశారు. దీంతో కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు నిరాశగా వెనుతిరిగారు. పైగా వారిలో ఐదవ విడత నియామకాలపై సందిగ్ధం నెలకొంది. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో 206 మంది స్టాఫ్ నియామకాలకు మార్గం సుగమమైంది. ఇంకా 200 మందికి పైగా స్టాఫ్ నర్స్ నియామకాలు జరగాల్సి ఉంది.



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

రోజుకు 50 మంది చొప్పున కౌన్సెలింగ్...



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, నిబంధనల మేరకు 206 మందికి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలు చేపడుతున్నాం. రోజుకు 50 మందికి చొప్పున కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. ఈ నెల 13, 14, 16, 17వ తేదీల్లో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నాం. ఇందుకు సంబంధించిన సమాచారంను ఎంపికైన అభ్యర్థులకు తెలియపరిచాం. అభ్యర్థులు సకాలంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి.
– డాక్టర్ శ్రీనివాసులు, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం.

ప్రజా ఫిర్యాదులకు గడువులోపు పరిష్కారం
– జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : సమస్యలపై ప్రజలు అందజేసే అర్జీలకు నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్, గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమాల్లో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిశీలించారు.

- పాఠశాల విద్య పూర్వ ఆర్‌జేడీ వై.రాఘవరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణ సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనలో సుండుపల్లె ఎంఈఓను మాత్రమే బాధ్యుడిని చేయడం సరికాదని, ఇందుకు కారకులైన నలుగురు ఉపాధ్యాయులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, ప్రదీప్ కోరారు.
- నంద్యాలరోడ్డులో గుడిపక్కనే ఉన్న బార్లు వెంటనే తొలగించాలని మైదుకూరుకు చెందిన ఆంజనేయులు కోరారు.
- సర్వే నెంబరు 416/2లో ఉన్న 4.96 ఎకరాల తమ డీకేటీ భూమిని ఇతరులు అక్రమంగా రిజిష్టర్ చేయించుకున్నారని, ఇందులో న్యాయం చేయాలని అట్లూరు మండలం తుమ్మలగండికి చెందిన బ్రహ్మానందరెడ్డి కోరారు.
- కమలాపురానికి చెందిన వెంకటసుబ్బమ్మ, చాపాడు మండలం మడూరు గ్రామానికి చెందిన చీపాటి సుబ్బమ్మ తమకు పింఛన్‌మంజూరు చేయాలని కోరారు.

చిరుత సంచారం.. ప్రజల్లో కలవరం



జమ్మలమడుగు: జమ్మలమడుగు–ముద్దనూరు మధ్యలో ఉన్న కొండ ప్రాంతంలో చిరుత సంచారం ప్రజల్ని కలవరపెడుతోంది. ఆదివారం చిరుత పులి కనిపించిందన్న వార్త దావానంలా వ్యాపించడంతో స్థానికులు హడలిపోతున్నారు. ముద్దనూరు పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను ఊరి వెలుపల ఉన్న డంపింగ్ యార్డు లో వేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఆహా రం లభిస్తుందని కుక్కలు డంపింగ్ యార్డు వద్దకు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నాయి. ఈ కుక్కలను తినడం కోసం పులి ఆ ప్రాంతానికి వస్తున్నట్లు స్థానిక గొర్రెల కాపరులు పేర్కొంటున్నారు.

భయం..భయం..
సుమారు రెండేళ్ల కిందట గండికోటలో చిరుతపులి గొర్రెలపై ప్రతిరోజు దాడులు చేసేది. అసలే పర్యాటక కేంద్రం కావడంతో ప్రజల రద్దీ ఎక్కువగా ఉండేది. ఓ సారి పట్టపగలే గండికోట జుమ్మా మసీదు వెనుకవైపు రెండు చిరుతల్ని చూసి మహిళా పర్యాటకులు భయందోళనలతో పరుగుతీశారు. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు వెంటనే బోను ఏర్పాటు చేశారు. ఆ రోజు రాత్రికే ఆడ చిరుత బోనులో చిక్కింది. దీంతో మరో చిరుత, దాని పిల్లలు ఎటో వెళ్లిపోయినట్లు గండికోట వాసులు తెలు పుతున్నారు. ఆ తర్వాత ముద్దనూరు మండలంలోని శెట్టివారి పల్లె గాలేరు–నగరి కాలువ సమీపంలోనూ చిరుత సంచారం కనిపించింది. కొంత కాలం పాటు చిరుత అనవాళ్లు కనిపించకుండాపోయాయి. దీంతో చిరుత పులుల్లేనట్లేనని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా మళ్లీ చిరుత కనిపించడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది

స్కూటరిస్టులు బహుపరాక్ .. జమ్మలమడుగు–ముద్దనూరు రహదారిలో ప్రతి రోజు వందల సంఖ్యలో ప్రజలు బైక్‌ల మీద ముద్దనూరు నుంచి జమ్మలమడుగుకు వెళ్తుంటారు. వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఒంటరిగా కాకుండా మరో వ్యక్తిని వాహనంలో ఉండేవిధంగా చూసుకోవాలని సూచిస్తున్నారు. ఈ విషయమై ముద్దనూరు రేంజ్ అటవీ అధికారి అశోక్‌ను వివరణ కోరగా.. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. పట్టుకునేందుకు తగినచర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

బ్రౌన్ నిర్మాణంపై నీలినీడలు

- మంజూరైన నిధులు వినియోగించుకోలేని వైనం
- నూతన సలహామండలి ఊసేలేదు

కడప కల్చరల్/వైవీయూ : కడప నగరంలోని సుప్రసిద్ధ సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం విస్తరణపై నీలినీడలు కమ్ముకున్నాయి. 2021లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించడంతో పాటు విస్తరణ పనుల కోసం రూ.5.5 కోట్లతో అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపంతో పలు సాంకేతిక కారణాల వల్ల నిధులు రావడం ఆలస్యమైంది. అయితే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషితో 2023 డిసెంబర్‌లో రూ.5.5కోట్లను అదనంగా పెంచి రూ.6,87,40,000లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటిని స్థల సేకరణ, నూతన భవన నిర్మాణానికి వినియోగించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ముఖ్యమంత్రి సమక్షంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం స్థలదాతలు కృష్ణస్వామి, సంపత్‌కుమార్ కుటుంబసభ్యులు సుప్రజ, అమృతవల్లి ముఖ్యమంత్రి సమక్షంలో విలువైన 5 సెంట్ల భూమిని ఉచితంగా ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించిన విషయం తెలిసిందే. మరో 20 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం దాతల ఖాతాల్లో రూ.2.92 కోట్లు జమచేశారు. దీంతో స్థలసేకరణ ప్రక్రియ పూర్తయింది. నిర్మాణపనులు వేగంగా చేపట్టడంలో విశ్వవిద్యాలయ అధికారులు, ప్రభుత్వ అధికారులు దృష్టిసారించకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అంతలోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడం, ప్రభుత్వం మారడంతో పాటు విశ్వవిద్యాలయ అధికారుల మార్పుతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. దీనికి తోడు విశ్వవిద్యాలయ పీడీ ఖాతాల్లో జమ అయిన సొమ్ము గత ఏడాది బడ్జెట్ కావడంతో వాటిని వినియోగించుకునే వీలులేకుండా పోయింది.



సీపీ బ్రౌన్ గ్రంథాలయం

సలహామండలి ఊసే లేదు
సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, వైవీయూ వీసీ, రిజిస్ట్రార్, వివిధ రంగాల్లో నిపుణులైన వారితో సలహామండలి ఉంటుంది. 2019లో రెండేళ్ల పదవీకాలంతో సలహామండలి ఏర్పాటైంది. 2021 జనవరిలో చివరి సలహామండలి సమావేశం నిర్వహించారు. కాగా సలహామండలి సభ్యులు ఎస్.సి.రామసుబ్బారెడ్డి, పోతురాజు వెంకటసుబ్బయ్య, కేతు విశ్వనాథరెడ్డి మరణించారు. వీరిస్థానంలో కొత్త సలహామండలిని ఏర్పాటు చేయకపోగా, సమావేశాలు నిర్వహించడం లేదని సలహామండలి సభ్యులు జానుమద్ది విజయభాస్కర్ పలుమార్లు సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. పనుల్లో జాప్యం గురించి తరచూ ప్రశ్నిస్తూనే ఉన్నారు.

త్వరలోనే నిర్మాణపనులు ప్రారంభిస్తాం
సీపీ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వ నిర్మాణ ఏజెన్సీని గుర్తించి దాని ద్వారా నిర్మాణపనులను వీలైనంత త్వరగా ప్రారంభిస్తాం. సీఎఫ్ఎంఎస్ ద్వారా నిధులను సంబంధిత ఏజెన్సీకి బదిలీ చేసి పనులను చేపడతాం. నిపుణులైన వారితో బ్రౌన్ కేంద్రం సలహామండలిని త్వరలోనే ఏర్పాటుచేస్తాం. – ఆచార్య కృష్ణారెడ్డి, వైస్ చాన్సలర్, వైవీయూ

క్లుప్తంగా

ఫిర్యాదులను పరిష్కరించాలి


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్'లో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రిహార్సల్స్

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రిహార్సల్స్‌ను కడప నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు గౌరవవందనం స్వీకరించి పరిశీలించారు. అనంతరం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు, స్వాతంత్య్ర సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, ప్రజలకు ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీ, భద్రతా ఏర్పాట్లు, సౌకర్యాల గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏ.ఆర్) ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఆర్‌ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పడిపోయిన రక్షణ గోడ


జలాశయం వద్ద కూలిన గోడ

జమ్మలమడుగు/మైలవరం : ఆహ్లాద వాతావరణం ఆస్వాదించడం కోసం వచ్చిన పర్యాటకులు ప్రమాదాల అంచుల్లోకి పోతున్నారు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా నేరుగా జలాశయంలో పడాల్సిందే. ఇటీవల దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో మైలవరం జలాశయం వద్దకు వచ్చి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. లష్కర్లు గుర్తించడంతో ప్రమాదం తప్పింది. మైలవరం జలాశయం నీటి నిల్వ కోసం ఏర్పాటుచేసిన కరకట్ట వద్ద పర్యాటకుల రక్షణ కోసం నిర్మించిన గోడ పడిపోయింది.

14న జాబ్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 14వ తేదీన ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ తెలిపారు. కేఎల్ గ్రూప్ (అమెజాన్)కంపెనీలో పికింగ్, ప్యాకింగ్, స్టోవింగ్, సార్టింగ్, లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ ఉద్యోగాలు, ఎల్‌వీసీలో ఆర్‌సీఏ, సీసీఏ, ఎల్‌సీఏ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి ఆసక్తిగల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి అర్హతను బట్టి రూ.7 వేల నుంచి రూ.20వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు.

ముగ్గురికి గాయాలు

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పి రోడ్డు ప్రక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కిషోరాచారి, నారాయణాచారి, ఎర్రప్పచారి స్వల్పంగా గాయపడ్డారు. కరెంటు లేకపోవడంతో ప్రయాణికులు ప్రాణాపాయం తప్పింది.

రిమ్స్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన



కడప రిమ్స్ ఆవరణలో కొవ్వొత్తులతో ర్యాలీ, నిరసన ప్రదర్శన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

మహిళా పీజీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారంపై జూనియర్ డాక్టర్ల నిరసన

కడప అర్బన్ : కోల్‌కతాలోని ఆర్‌జీకెఏఆర్ మెడికల్ కళాశాలలో మహిళా పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటనకు నిరసనగా సోమవారం రాత్రి కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్లు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. కేసులో సరైన, పారదర్శక దర్యాప్తు జరగాలని.. దేశవ్యాప్తంగా వైద్యులకు రక్షణ కల్పించేందుకు కేంద్రం రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దుండగుడిని వీలైనంత త్వరగా శిక్షించకుంటే నిరవధికంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. బాధితురాలి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ర్యాలీలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల, దంతవైద్య కళాశాల జూనియర్ వైద్యులందరూ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు టీడీపీ నేతల బెదిరింపులు


పుట్టా సుధాకర్‌యాదవ్‌ను కలిసేందుకు వెళ్లిన ఫీల్డ్ అసిస్టెంట్లు

చాపాడు : టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చిరుద్యోగులైన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గ్రామ స్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు బెంబేలెత్తిపోతున్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఫీల్డ్ అసిసెంట్లను తొలగిస్తామని టీడీపీ వర్గీయులు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ఇందుకు వేదికగా మారింది. ఇప్పటికే జరిగిన గ్రామ సభల్లో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లపై టీడీపీ వర్గీయులు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశారు. 22 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా, ఇప్పటికే గ్రామ సభలో ఐదుగురిపై ఫిర్యాదు చేశారు. జిల్లా స్థాయి గ్రామసభలో మిగిలిన వారిపై ఫిర్యాదు చేస్తామని టీడీపీ వర్గీయులు చెబుతున్నారు. తమ ఎమ్మెల్యేతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయించి తొలగిస్తామని హెచ్చరికలు పంపారనే ఆరోపణలున్నాయి. మంగళవారం మండల స్థాయిలో ఉపాధి హామీ తనిఖీపై సామాజిక బహిరంగ సభ జరుగనుండడంతో తమపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వారంతా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి 2007 నుంచి తాము విధులు నిర్వహిస్తున్నామని.. కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనూ తమ ఉద్యోగాలు తొలగించలేదని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ఉద్యోగాలు తొలగిస్తామని టీడీపీ నాయకులు హెచ్చరిస్తున్నారని ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తాము అవినీతికి పాల్పడే ఆస్కారం కూడా ఉపాధి పనుల్లో లేదని.. పని చేస్తేనే కూలీల ఖాతాలకు నేరుగా వేతనాలు జమవుతాయని, కానీ తమపై కక్షపూరితంగా ఫిర్యాదు చేస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన చెందుతున్నారు.

నితీష్ కుటుంబంలో విషాదం


గిద్దలూరు నితీశ్ (ఫైల్)

ప్రొద్దుటూరు : తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నితీష్ మరణించడంతో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రొద్దుటూరు మండలంలోని దారా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న గిద్దలూరు శ్రీనివాసులు వస్త్ర భారతి క్లాత్ మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్నాడు. శ్రీనివాసులుకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు జ్ఞానేష్ వేలూరు విట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. చిన్న కుమారుడు నితీశ్ (21) చెన్నై ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం బీటెక్ చదువుతున్నాడు. నితీష్ సోమవారం తన మిత్రులతో కలిసి అరుణాచలానికి వెళ్లి తిరిగి వస్తుండగా తిరువళ్లూరు జిల్లా కనకమ్మ సత్రం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు–ఎదురుగావా వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నితీశ్‌తోపాటు మరో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషాదకర సంఘటన గురించి తెలుసుకున్న నితీశ్ తల్లిదండ్రులు సుజాత, శ్రీనివాసులు ఆదివారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లారు. సోమవారం తిరువళ్లూరులో పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం నితీష్ మృతదేహాన్ని తీసుకుని ఇంటికి చేర్చారు. ధారా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వేంపల్లి అరుణ్‌కుమార్‌రెడ్డితోపాటు మరికొందరు ప్రమాదం జరిగిన స్థలానికి వెళ్లి బాధితులకు అండగా నిలిచారు.

టీడీపీ మాజీ కౌన్సిలర్ దౌర్జన్యం

ప్రొద్దుటూరు: టౌన్ ప్లానింగ్ అధికారి మునిరత్నంపై టీడీపీ మాజీ కౌన్సిలర్ చింతకుంట జయలింగారెడ్డి సోమవారం దౌర్జన్యానికి దిగారు. మాజీ కౌన్సిలర్ జయలింగారెడ్డి సతీమణి చింతకుంట సరితారెడ్డి ప్రస్తుతం 17వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. తన వార్డు పరిధిలో మసీదు వెనుక మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నా పట్టించుకోలేదని గత కౌన్సిల్ సమావేశంలో ఆమె ప్రశ్నించారు. సోమవారం తన భర్త జయలింగారెడ్డితో కలిసి మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆమె తన ఫిర్యాదుపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఉద్యోగి మునిరత్నంను ప్రశ్నించారు. 1991 నుంచే ఆ స్థలానికి అధికారిక పత్రాలున్నాయని, ఆ స్థలంపై ఏమి చేయలేమని మునిరత్నం తెలిపారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన జయచంద్రారెడ్డి ఆగ్రహంతో కమిషనర్ ఛాంబర్‌లోనే మునిరత్నంను దూషించాడు.

ఆ భూమే కారణమా..

ఓ ఎనిమిది సెంట్ల భూమి విషయంలో ఇద్దరి మధ్య పొరపొచ్చాలు ఉన్నాయి. ప్రొద్దుటూరు మునిసిపల్ కార్యాలయం పక్కనే ఎనిమిది సెంట్ల స్థలాన్ని జయలింగారెడ్డి గతంలో ఆక్రమించాడు. ఈ స్థలం విలువ సుమారు రూ.3 కోట్లకు పైగా ఉంటుంది. అధికారులు ఈ స్థలంపై కోర్టును ఆశ్రయించగా.. సదరు స్థలం జయలింగారెడ్డికి చెందినది కాదని ఉత్తర్వులిచ్చినట్లు తెలిసింది. అయినా వైఎస్సార్‌సీపీ నుంచి గెలిసిన జయలింగారెడ్డి పట్టు వదలకుండా ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు అప్పట్లోనే ప్రయత్నాలు చేశారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మునిరత్నం ఈ స్థలాన్ని అప్పగించడం కుదరదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ విషయం మనసులో పెట్టుకుని మునిరత్నంపై ఆగ్రహం వ్యక్తం చేశారని అధికార వర్గాలు తెలిపాయి.

ఎస్ఎంసీ ఎన్నికలు మళ్లీ నిర్వహించండి

హెచ్ఎంపై ఎమ్మెల్యే మాధవి ఆగ్రహం


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి పాఠశాల హెచ్ఎంను ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఓ ఉద్యోగిని ఎన్నికల్లో పాల్గొనిందని ఫిర్యాదు ఉందన్నారు. దీని మేరకు విచారణ చేయిస్తామని తెలిపారు. పాఠశాలల్లో రాజకీయాలు చేస్తున్నారా అంటూ హెచ్ఎంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. వైఎస్ఆర్‌సీపీ మారి రెండు నెలలైందని, ఇప్పటికైనా కళ్లు తెరవండంటూ హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయం తనిఖీ


విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీనియర్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

వల్లూరు : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ తెలిపారు. వల్లూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల భవనం, లైబ్రరీ, టాయిలెట్లు, వంట గది పరిశీలించారు. భోజన మెనూ గురించి ప్రిన్సిపల్ నజీమున్నిసాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, భారత రాజ్యాంగం, గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న న్యాయ సేవలు, బాలల సంరక్షణ కొరకు అందిస్తున్న స్నేహ పూర్వక న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాకీ డబ్బు విషయమై ఘర్షణ

ప్రొద్దుటూరు క్రైం : బాకీ డబ్బు విషయమై ఇరువురు యువకులు ఘర్షణ పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. జిన్నా రోడ్డుకు చెందిన ఆరిఫ్, పవర్ హౌస్ రోడ్డుకు చెందిన సయ్యద్ మహ్మద్ సైఫ్ స్నేహితులు. ఆరిఫ్ తమ్ముడు మహ్మద్‌సైఫ్‌కు డబ్బు బాకీ ఉన్నాడు. ఎన్ని సార్లు అడిగినా ఇస్తానని వాయిదా వేస్తూ ఉన్నాడు.

ఈ క్రమంలో ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మోడంపల్లె బైపాస్‌రోడ్డులోని చాయ్‌బంక్ వద్ద డబ్బు విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ సమంజసం కాదు

మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : ముస్లిం ఆస్తుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ముస్లిం ఆస్తుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించడం సమంజసం కాదన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ఇండియా కూటమితోపాటు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రూ.14 వేల కోట్లు అప్పుచేసి సామాజిక భద్రత పింఛన్లు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించిందన్నారు. రెండున్నర నెల కావస్తున్నా సూపర్ సిక్స్ అమలు కాలేదని మండిపడ్డారు. సంపద సృష్టించి.. సంక్షేమ పథకాలు అమలు చేస్తానని అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. సంపద సృష్టించడం అంటే టోల్ వసూలు చేయడం, అప్పులు చేయడమేనని ఎద్దేవా చేశారు. జగన్ పలావే పెడుతున్నాడు... నేను బిర్యానీ పెడతానని ఓట్లు దండుకున్న బాబు మరోసారి తన నైజాన్ని ప్రజలకు చూపించాడన్నారు. మద్యం ప్రియులకు కొత్త పాలసీ అంటూ కాలం వెళ్లదీస్తూ పాత పద్ధతినే అనుసరిస్తున్నాడని మండి పడ్డారు. ఉచిత ఇసుక విధానం ఎక్కడా అమలు కాలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే అధిక ధర వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న సీఎంగా ఉంటే అమ్మఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, రైతు భరోసా అన్ని పథకాలు ఇంటికి చేరేవన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు, దౌర్జన్యాలు, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడతానన్న పవన్ నోరు మెదపడంలేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, గంగాధర్ రెడ్డి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, కొండారెడ్డి, ఇర్ఫాన్, నారాయణరెడ్డి, మస్తానయ్య, నాగేష్, సన్న, భాస్కర్, జిలానీ, సురేష్, జావీద్, షావలి తదితరులు పాల్గొన్నారు.

రామలక్ష్మణ నాణెం అంటూ వ్యాపారికి బురిడీ

- ముగ్గురు వ్యక్తులను లాడ్జిలో నిర్బంధించి దాడి
- 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్) : ముగ్గురు వ్యక్తులను లాడ్జిలో బంధించి దాడి చేసిన ఘటన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... కడప పట్టణానికి చెందిన గంజికుంట రాజేంద్ర కడపలోని నాగరాజు పేటలో సంగీత్ మొబైల్స్ పేరుతో షాపు నిర్వహిస్తున్నాడు. అతనికి రెండు నెలల క్రితం తిరుపతిలోని ఓ రెస్టారెంట్‌లో నరసింహ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. నరసింహ తన వద్ద రామలక్ష్మణ కెమికల్ నాణెం ఉందని, దాని విలువ మార్కెట్‌లో రూ. 2 కోట్లు ధర పలుకుతుందని రాజేంద్రను నమ్మించాడు. నాణెం కోసం రూ. 3 లక్షలు అవసరమని అంత మొత్తం ఇవ్వాలని కోరాడు. ఈ విషయమై నరసింహ, రాజేంద్ర మదనపల్లెలో కలుసుకున్నారు. నాణెం గురించి మాట్లాడుకున్నారు. నాణెం చూపిస్తేనే డబ్బులు ఇస్తానని రాజేంద్ర చెప్పడంతో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. దీంతో రాజేంద్ర అతని ఫోన్ తీసుకుని వెళ్లిపోయాడు. అప్పటి నుంచి నరసింహ తన ఫోన్ తిరిగి ఇవ్వాలని రాజేంద్రను కోరుతున్నాడు. ఈ క్రమంలో అతను రాజేంద్రకు ఓ వీడియో పంపి తన వద్ద నాణెం ఉందని, అది కావాలంటే విజయవాడకు రావాలని ఆశ చూపాడు. దీంతో రాజేంద్ర తన స్నేహితులు ఇద్దరిని తీసుకుని ఈనెల 11న విజయవాడకు చేరుకున్నాడు. నరసింహకు ఫోన్ చేయగా రాయనపాడు చెరువు వద్దకు రావాలని సూచించాడు. అప్పటికే కొంత మందితో అక్కడికి చేరుకున్న నరసింహ తన ఫోన్ ఇవ్వాలని రాజేంద్రను అడిగాడు. అతను తన వద్ద ఫోన్ లేదని చెప్పడంతో నరసింహ, అతనితో వచ్చిన వ్యక్తులు కడప నుంచి వచ్చిన ముగ్గురిపై దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా గవర్నర్‌పేటలోని శాంతి లాడ్జికి కారులో తరలించి నిర్బంధించాడు. లాడ్జిలోనూ మరోసారి దాడి చేశారు. రాజేంద్ర భార్యకు ఫోన్ చేసి నీ భర్త మావద్ద ఉన్నాడని, రూ. 30 లక్షలు ఇస్తే వదిలిపెడతామని బెదిరించారు. ఆ సమయంలో బాత్రూంకు వెళ్లిన రాజేంద్ర తన భావకు మెసేజ్ చేశాడు. అతను 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు శాంతి లాడ్జికి చేరుకుని రాజేంద్రతో పాటు అతని స్నేహితులను రక్షించారు. రాజేంద్ర, అతని స్నేహితులను లాడ్జిలో నిర్బంధించి కుటుంబ సభ్యులను బెదిరించిన నరసింహతోపాటు మరో 14 మందిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో భవానిపురానికి చెందిన ప్రవీణ్, దినేష్, బూరి రాజేష్, రాయనపాడుకు చెందిన ధీరజ్, స్వాగత్, సోహైల్ హర్షద్, గోవాడ సీతారాం, పాండు, నాని, సందీప్, సాంబ, సాయి, సత్యలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామలక్ష్మణ కెమికల్ కాయిన్స్, రైస్ పుల్లింగ్, రెండు తలల పాములు వంటి వాటికి మహిమలు ఉన్నాయని, కోట్లు విలువ చేస్తాయని అనే మాటలు నమ్మి మోసపోవద్దని గవర్నర్‌పేట సీఐ ఎం. సత్యనారాయణ ప్రజలకు సూచించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని.. వృద్ధుడు మృతి

వాల్మీకిపురం : ద్విచక్ర వాహనాలు ఢీకొని వృద్ధుడు మృతి చెందారు. మదనపల్లి మండలం గుండవారిపల్లికి చెందిన నల్లప్ప (65) తన అల్లుడితో కలసి ద్విచక్ర వాహనంపై వాల్మీకిపురంలోని గురుకుల పాఠశాలకు వచ్చి వారి పిల్లలతో మాట్లాడి.. తిరిగి గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలోని సబ్ జైల్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నల్లప్ప మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యార్థులు రాజకీయాల్లోకి రావడంతోనే విద్యా రంగం ప్రక్షాళన జరుగుతుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. రాబోయే కాలంలో విద్యా వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నగరంలోని మున్సిపల్ మెయిన్ హైస్కూల్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య వార్షికోత్సవం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పోరాటం చేసిన ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ 117 జీవో రద్దు చేయాలని, అదే విధంగా యూనివర్సిటీ కేంద్రాలలో విద్యార్థులకు స్వేచ్ఛ నివ్వాలని కోరారు. అనంతరం, క్రీడల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.నాగ సుబ్బారెడ్డి, గుంటి వేణుగోపాల్, కె.శివశంకర్, గుజ్జుల వలరాజు, అరుణ్, అకీరానంద్, చంద్ర, లక్ష్మి, నిఖిత, మస్తాన్, రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులకు వేధింపులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రా సంఘాల లీడర్లు, ఒప్పంద కార్మికులు, తదితర చిరు ఉద్యోగులపై వేధించి.. తొలగించే విధానాలకు స్వస్తి పలకాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి అన్నారు. ఏఐటీయూసీ కడప నగర సమితి ఆధ్వర్యంలో తహసీల్దారు నారాయణరెడ్డికి ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల మాటలు విని రోజువారీ వేతనంపై ఆధారపడి బతుకుతున్న చిరుద్యోగులను తొలగిస్తే వారి జీవనం కష్టంగా మారుతుందన్నారు. ప్రభుత్వ పథకాల అమలు కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ సదుపాయం అమలు కావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు శాంతమ్మ, ఏఐటీయూసీ నాయకులు రామాంజనేయులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ సెక్రటరీ మల్లికార్జున, ఎస్.సావిత్రి, బి.సుజాత, జి.సరస్వతి, పి.చిన్నక్క, అంకుశం, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానం


రెడ్డిబాబు, వెంకటలక్ష్మీలతో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, బ్లాక్ కో–ఆర్డినేటర్

లక్కిరెడ్డిపల్లి : పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఎంపికైన వీరబల్లి వెంకటలక్ష్మీ, వీరబల్లి రెడ్డిబాబులు సోమవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఈ ఆదర్శ దంపతులు ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోటలో జరగబోవు స్వాతంత్య్ర వేడుకలలో పాల్గొంటారని ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లికి చెందిన ఈ దంపతులకు రాను పోనూ విమానం టికెట్లు, ఢిల్లీలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. బ్లాక్ కో–ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, సూపరింటెండెంట్ గురుప్రసాద్ వీరిని అభినందించారు.